నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | మార్చ్ 02, 2024 | www.navatelangana.com

బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి నీటి విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసినట్లు ఎస్సారెస్పీ ఎఈఈ రవి తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు నుండి సిడబ్ల్యుసి అధికారుల సమక్షంలో మహారాష్ట్ర , తెలంగాణ ప్రాజెక్టుల అధికారులు శుక్రవారం బాబ్లీ గేట్లు తెరిచి దిగువకు నీటి విడుదల చేసి 0.6 టీఎంసీల నీరు విడుదల చేసి మూసివేయనున్నారు.



వివరాలు మెయిన్‌లో..

కందకుర్తి గోదావరిలో మహిళ గల్లంతు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం కందకుర్తి గోదావరి లో పుణ్య స్నానాలను ఆచరించడానికి వచ్చిన బాలామణి అనే మహిళ గోదావరిలో ప్రమాదవశాత్తు జారి గల్లంతయ్యింది. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, 108 వాహనం, ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లినా లాభం లేకపోయింది. పాండుఫారానికి చెందిన బాలమణి కందకుర్తి గోదావరిలో ఉన్న రాతి శివాలయం పక్కన గల మెట్ల వద్ద స్నానాలను ఆచరిస్తున్న క్రమంలో ఆమె ప్రమాదవశాత్తు జారిపడిందని తెలిసింది.



వివరాలు మెయిన్‌లో..

జీపీ కార్మికుల వేతన వెతలు..

- ఆరు నెలలుగా జీతాల్లేవ్
- అప్పు చేస్తూ కుటుంబ పోషణ
- ప్రభుత్వం మారినా తీరని కష్టాలు

నవతెలంగాణ-భిక్కనూర్

పారిశుధ్య కార్మికులను అర్ధరాత్రి సూర్యుళ్లుగా సంబోధిస్తుంటారు. అందరు ఉదయం లేచే వరకు రోడ్లను శుభ్రం చేసి అద్దంలా తీర్చిదిద్దుతుంటారు. ఎక్కడ మురుగు ఉంటే అక్కడ ప్రత్యక్షమై పరిశుభ్ర పనులు చేపడుతుంటారు. అలాంటి అర్ధరాత్రి సూర్యుళ్ల జీవనంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఆరు నెలలుగా అందకపోవడంతో అల్లాడిపోతున్నారు. మనసు చంపుకొని తెలిసిన వారి దగ్గర చేయి చాచుతూ కుటుంబ పోషణను గట్టెకిస్తున్నారు. మరికొందరు వడ్డీలకు అప్పు తెచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా.. తమ వేతన వెతలు తీర్చడం లేదని వాపోతున్నారు. వచ్చే అరకొర వేతనం సైతం సకాలంలో అందకపోవడంతో మదనపడుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 526 గ్రామపంచాయతీలలో సుమారు 2500 కార్మికులు పని చేస్తున్నారు. సీజన్‌లతో సంబంధం లేకుండా ఎండ, వాన, చలిని లెక్క చేయకుండా గ్రామపంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు పని చేస్తుంటారు. ప్రభుత్వ ఎలాంటి స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టినా.. జీపీ కార్మికులే ముందుంటారు.

ప్రభుత్వాలు, సర్పంచులు మారినా నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాన్ని శుభ్రం చేస్తారు. అలాంటి పంచాయతీ కార్మికులకు ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఆరు నెలలుగా జీతాలు ఆగిపోయాయి. జీతాల కోసం చేయి చాపాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఆరు నెలల నుండి జీతాలు రాక అప్పులు చేసి జీవిస్తున్నారు. కార్మికులకు వచ్చే అరొకర వేతనం అది కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో తమ కుటుంబం ఏ విధంగా జీవించాలో అని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

ప్రతి గ్రామంలో వచ్చే టాక్స్ కలెక్షన్, ఇతర పన్నుల ద్వారా వచ్చే నిధులు పంచాయతీ జనరల్ ఫండ జమచేసి కార్మికులకు జీతాలు చెల్లించాలి. కొన్ని గ్రామపంచాయతీలలో టాక్స్ కలెక్షన్ కలెక్షన్ అవుతున్నా జనరల్ ఫండ్‌లో నుండి డబ్బులు విత్ డ్రా కాకపోవడం, జీతాలు వేసినా ఫ్రీజింగ్ కారణంగా జీతాలు పడడం లేదు. మరికొన్ని గ్రామపంచా యతీలలో టాక్స్ కలెక్షన్ లేని కారణంగా జీతాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ ప్రజల ప్రాణాలు కాపాడుతూ, గ్రామపంచాయతీలను అందంగా తీర్చిదిద్దే జీపి కార్మికులకు జనరల్ ఫండ్ తో సంబంధం లేకుండా ప్రభుత్వం గౌరవ వేతనం అందజేసి కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా పంచాయతీ కార్మికుల బతుకులు మారాలని కార్మికులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.



5వ తేదీలోగా జీతాలు చెల్లించాలి

ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీపి కార్మికులకు ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలి. చాలీచాలని జీతాలతో జీవిస్తున్న పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతం చెల్లించకపోవడం దారుణం. వారి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం గౌరవ వేతనం ఎప్పటికప్పుడు అందజేయాలి.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్





మొక్కలకు నీరు పడుతున్న కార్మికుడు



అర్ధరాత్రి వేళ నీటిని తరలించేందుకు పడిగాపులు

ప్రతేడూ.. అదేగోడు

- సాగునీటికి కోసం రైతులకు తప్పని జాగరణ
- నిద్రమాని.. అర్ధరాత్రి పడిగాపులు
- పంటకు నీటి తడి అందించేందుకు పాట్లు
- నీరులేక నిలిచిన లిఫ్ట్.. మంజీరా నీటికి ఎదురుచూపులు



నవతెలంగాణ-బోధన్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కాపాడుకోడానికి ఎన్ని ఇబ్బందులు పడతారో వారి కష్టం స్వయంగా చూస్తేకానీ తెలవదు. మనం తినే నాలుగు అన్నం మెతుకులు మన నోట్లో చేరాలంటే రైతు రాత్రనకా, పగలనకా కష్ట పడాల్సిందే. అయినా ప్రభుత్వాలు రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించక, ఏదో నామమాత్రంగా ధర ప్రకటించి రైతుల కష్టాలకు విలువలేకుండా చేస్తున్నారు.

యాసంగి సీజన్‌లో భాగంగా వేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు విశ్వప్రయత్నాలే చేస్తున్నారు. బుధవారం రాత్రి రైతుల సాగునీటి ఇబ్బందులపై నవతెలంగాణ పరిశీలించగా సాలూర శివారులో సాగునీటి కోసం రైతులు అర్ధరాత్రి వరకు సాగునీటి కాలువల వెంట తిరుగుతూ, తమ పంట పొలాలకు నీరు పారించుకోడానికి, గండ్లు పూడుస్తూ ఇబ్బందులు పడుతూ కనిపించారు. ప్రస్తుతం సాగునీటి సరఫరా 5వ విడత నిజాంసాగర్ నీటి విడుదల మార్చి ఒకటితో ముగియడంతో ఆ నీటినే రైతులు తమ పంట పొలాలకు చేరేలా రాత్రి, పగలు పనిలో నిమగ్నమవుతున్నారు. పైభాగం నుంచి సాగునీరు కింది భాగంలో చేరడానికి ఇబ్బందులు కలగడంతో కెనాల్‌ల వెంట రైతులు పడిగాపులు పడాల్సి వస్తుంది. సాలూర కామక్క చెరువు ఆయకట్టు కింద 488 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. కానీ కామక్క చెరువులో పూర్తి స్థాయిలో సాగునీరు నిల్వలేక నిజాంసాగర్ నీటిని చెరువులో మళ్లించుకుని పొలాలకు పంపుతామని రైతులు తెలిపారు. 5వ విడత నిజాంసాగర్ నీటి విడుదల మార్చి 1వ తేదీన ముగుస్తుందని, చివరి విడత అనగా 6వ విడత నీటి విడుదల మరో 10 రోజుల తర్వాత ఉంటుందని ఇరిగేషన్ ఏఈ శృతి తెలిపారు. డీ-28 కెనాల్ పరిధిలో 30 వేల ఎకరాలకు, బోధన్ మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని ఏఈ శృతి తెలిపారు. చెరువు ఆయకట్టు పరిధిలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండడంతో వేసిన వరి పంట కాపాడుకోడానికి రాత్రిశు జాగారం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

మంజీరాలో నీరులేక ఎండుతున్న లిఫ్ట్..

సాలూర రైతులకు వరప్రదాయినిగా ఉన్న ఎత్తిపోతల పథకం(లిఫ్ట్) ప్రస్తుతం మంజీరా నదిలో నీరు లేక లిఫ్ట్ ఎండిపోయే దశకు చేరింది. పంటలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో రైతులు ఇప్పటి వరకు నదిలో ఇసుక మేటలు తొలగించి నీటిని వాడుకున్నారు. ప్రస్తుతం లిఫ్ట్ మూతపడడంతో రైతులు నిజాంసాగర్ కెనాల్ నీటిపై ఆధారపడుతున్నారు. ఇప్పటి నుంచే ఎండలు అధికంగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మరో 10 రోజులు పంటలకు సాగునీరు అందిస్తే పంటలు చేతికొస్తాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం మరికొన్ని రోజులు సాగునీటిని విడుదల చేస్తేనే తమ పంటలు దక్కుతాయని లేకుంటే ఎండిపోయే పరిస్థితులు వస్తాయని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఎకరానికి పెట్టుబడి కూలీల ధరలు, ఎరువులు భారంతో రూ.35000ల వరకు అయిందని, తమ పంటలు తమకు దక్కుతేనే అప్పులు తీరే మార్గం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

నీటికోసం చీకట్లో పనిచేస్తున్నా..

• నీరడి గంగారాం. సాలూర



నాకున్న ఎకరం పాటు మరో ఎకరం కౌలు తీసుకుని వరి సాగు చేస్తున్నా. ఇప్పుడు సాగునీరు చాలా అవసరం. దాంతో నిజాంసాగర్ నీళ్ల కోసం రాత్రిపూట పని చేస్తున్నా. నాకు వ్యవసాయమే ఆధారం. అధికా రులు ఇంకా 5 తడులకు నిజాంసాగర్ నీరు అందించాలి. అయితేనే మా పంటలు చేతికొస్తాయి. మంజీరలో నీరులేక లిఫ్టు బంద్ అయింది.

కెనాల్ నీరే ఆధారం..

• పీరయ్య, రైతు, సాలూర



నాకు అర ఎకరం భూమి ఉంది. దాంతోపాటు ఎకరం న్నర కౌలుకు తీసుకుని వరి సాగుచేసినా. చెరువుల సరిపడా నీరు లేక కెనాల్ నీళ్లపై ఆధారపడినా. కష్టపడి పండిం చిన పంట చేతికి రావాలంటే రాత్రిపూట తిరిగి పంటలకు నీరు పారించుకోవాలి. చీకట్ల ఇబ్బందులు అవుతున్నా పంటలు కాపాడుకో డానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పుడే ఎండలు ఎక్కువ ఉండడంతో పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటున్నాం.

5 విడతలుగా సాగునీరు అందించాం

• ఇరిగేషన్ ఏఈ శృతి

నిజాంసాగర్ కెనాల్ ద్వారా రైతుల పంటలకు 5 విడతల వారిగా నీటిని విడుదల చేశాం. ఫిబ్రవరి 20న ప్రారంభమయిన 5వ విడతనీటి విడుదల మార్చి 1వ తేదీన ముగిసింది. మరో పది రోజులలో 6వ విడత సాగునీటిని 10 రోజుల పాటు విడుదల చేస్తాం. ముందుగా రైతుల పంట పొలాలకు సాగునీరు పారిన తర్వాత మిగిలితేనే చెరువులకు నీటిని మళ్లించుకోవచ్చు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీటిని అందించే ప్రయత్నం చేస్తున్నాం.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ఊర చెరువు వద్ద నూతనంగా నిర్మించిన మడేలేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ముగింపు ఉత్సవాల్లో భాగంగా గ్రామం నుండి చెరువు వద్ద మడేలేశ్వర స్వామి ఆలయం వరకు బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా బోనాలు ఎత్తుకున్న మహిళలు రోడ్డు వెంట నడిచేటప్పుడు రజకుల ఆచారం ప్రకారం రజక సంఘం సభ్యులు రోడ్డుపైన చీరలను పరిచారు. అనంతరం ఆలయంలో మడేలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రజక సంఘం అధ్యక్షులు ఆవుట్ల బాజన్న, సుంకేట నరసయ్య సుంకేట శ్రీనివాస్, సుంకేట రమేష్, రజక సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బెగ్గింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత డిమాండ్
- పిల్లలను చిత్రహింసలు పెట్టి, కొట్టి వికలాంగులుగా చేసి బిక్షం ఎత్తిస్తున్నారని ఆవేదన

నవతెలంగాణ-కంఠేశ్వర్

పిల్లల్ని చిత్రహింసలు పెట్టి కొట్టి వికలాంగులుగా చేసి బిక్షం ఎత్తిస్తూ నరకం చూపెడుతున్న బెగ్గింగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత డిమాండ్ చేశారు.

జిల్లా కేంద్రంలోని నాగారాం 80 క్వార్టర్స్‌లో శుక్రవారం ఓ బాలుడి ఇంటిని పరిశీలించారు. నాగారం 80 క్వార్టర్స్‌లో ప్రాంతంలో ఇతర జిల్లాల నుంచి చిన్నపిల్లల్ని కిడ్నాప్ చేసి తీసుకువచ్చి ఆ పిల్లల్ని చిత్రహింసలు పెట్టి కొట్టి వికలాంగులుగా చేసి వారిని బిక్షం ఎత్తిస్తు నరకం చూపెడుతున్న బెగ్గింగ్ మాఫియా ఘటనపై స్పందించి ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వారి కార్యకర్తలు ఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. మహబూబ్ అనే వ్యక్తి వికలాంగుడు తన ఇల్లు ఇష్టం వచ్చిన వారికి రెంటుకు ఇవ్వడం వల్ల ప్రతి రెండు నెలలు మూడు నెలలు 15 రోజులకు ఒకసారి ఆ ఇంటిలో కొత్త కొత్త కుటుంబాలు కనపడతాయని స్థానికులు చెప్పారు. ఎందుకు ఎవరు వచ్చినా ఎక్కువ రోజులు ఉండట్లేదు అని అడుగుతే నా ఇల్లు నా ఇష్టం మీకు అడిగే అర్హత లేదు అంటూ స్థానికులకు బెదిరింపులకు గురి చేస్తూ ఎవరితో సరిగ్గా మాట్లాడేవాడు కారని సమాచారం. సదరు బాబును కూడా గత వారం రోజుల క్రితం అతడి ఇంట్లో అద్దెకు ఉంటున్న మైనార్టీ మహిళ ఎత్తుకు వచ్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారని తెలిపారు. కొత్త బాబు ఎవరు అని ప్రశ్నించగా తమ ఆడబిడ్డ కొడుకు అని సమాధానం ఇచ్చాడని తెలిపారు. నాలుగు రోజుల క్రితం బాబు విపరీతంగా ఏడవడంతో పక్కింటి వారు గమనించి ఎందుకు బాబు అంతలా ఏడుస్తున్నారు ఒకసారి మీరు బయటకు తీసుకురండి ఎందుకు బయటకు ఆ బాబుని తీసుకు రావటం లేదని స్థానికులు ప్రశ్నించడంతో బయటకు తీసుకొచ్చేసరికి బాబుకు విపరీతమైన గాయాలు కనిపించాయి.

కండ్లకు సైతం ఇన్‌ఫెక్షన్ సోకి ఆ కళ్ళల్లో నుంచి రక్తం చీము కారడం గమనించి స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని బాబుని బాలల సంరక్షణ సంస్థకి అప్పగించినట్టు తెలిపారు. ఎక్కడైతే మాస్ ఏరియాలు ఉన్నాయో చిన్నపిల్లలకి స్నాపింగ్సే కాదు గంజాయి డ్రగ్ అమ్మాయిల తరలింపు ఇలాంటివి చాలా జరుగుతున్నాయని చాలాసార్లు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇకనైనా మాస్ ఏరియాలో పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని యువతను మహిళలను చిన్నపిల్లల్ని కాపాడాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత డిమాండ్ చేశారు. ఇందులో ఐద్వా నాయకులు శారద ఇంద్ర శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



చిత్రహింసలకు గురైన బాలుడు..



మాట్లాడుతున్న సుజాత



ఒకరు డిబార్

- ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షల్లో జిల్లాలో ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాగా, 664 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్ హాజరు అయ్యారని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లాలో శుక్రవారం 96.3% విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్ ల ఆధ్వర్యంలో 51 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని తెలిపారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ శుక్రవారం నిజామాబాద్ బాలుర కళాశాల ఏ, బీ సెంటర్లను, విశ్వశాంతి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని, అలాగే వర్నిలోని మోడల్ కాలేజ్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు 8167 మంది విద్యార్థులకు గాను 7893 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. 274 మంది విద్యార్థులు గైరాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1546 మంది విద్యార్థులు పరీక్ష హాజరు కావలసి ఉండగా 1419 మంది విద్యార్థులు హాజరై 127 మంది విద్యార్థులు గైరాజరయ్యారన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 37 సెంటర్ల నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి పరీక్షలకు 9713 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 9312 విద్యార్థులు హాజరై 401 మంది విద్యార్థులు గైరాజరయ్యారనీ ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని కొత్త తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శిరీషను ఎంపీడీవో సంతోష్ కుమార్, మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. శిరీష పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న పోటీ పరీక్షలకు సన్నద్ధం కాగా అట్టి ఫలితాలు ఇటీవల వెలువడగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ రెండు ఉద్యోగాలు ఒకేసారి సాధించడంతో శుక్రవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గంగ మోహన్, ఏపీ ఓ నరసయ్య, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న పలువురు

గర్భిణుల్లో రక్తహీనత సమస్య రానీయొద్దు

- వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

గర్భిణీలలో రక్తహీనత సమస్య రాకుండా వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ, వైద్యాధికారులతో జూ మీటింగ్ ద్వారా ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు గర్భిణీల నమోదు క్రమం తప్పకుండా చేపట్టాలని తెలిపారు. రక్తహీనత సమస్యతో గర్భిణీలకు సమస్యలు వస్తే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని అన్నారు. గ్రామస్థాయిలో బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మందులు అందించాలని కోరారు. రాష్ట్రీయ బాల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు పరీక్షలు చేసి ఆరోగ్య రికార్డులను నమోదు చేయాలని సూచించారు.

ఆదివారం పల్స్ పోలియో..

వచ్చే ఆదివారం ఈ నెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. 0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. జూమ్ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ లక్ష్మణ్ సింగ్, డిప్యూటీ డిఎంహెచ్వోలు శోభారాణి, చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



బీజేపీ తీర్థం పుచ్చుకున్న బీబీపాటిల్

- బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎంపీ

నవతెలంగాణ-కోటగిరి/మద్నూర్

జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని రాజకీయాలలో బాన్సువాడ నియోజకవర్గంలో రోజుకో మలుపు తిరుగుతున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ శుక్రవారం బిజెపి గూటికి చేరడంతో నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నిన్న మొన్నటి వరకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడుగా రాబోయే ఎన్నికలలో బీబీ పాటిల్ అభ్యర్థిగా బరిలో దిగుతాడని బీఆర్ఎస్ నుంచి సమాచారం వచ్చినా.. శుక్రవారం మధ్యాహ్నం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశారు. ఢిల్లీలో బీజేపీ నాయకుల సమక్షంలో బీజేపీలో చేరారు.



సెల్ టవర్లు ఏర్పాటు చేయవద్దు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని గోలీ లింగాల గ్రామంలో ఎయిర్టెల్ సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని ఇటీవలే ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శుక్రవారం రోజు మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో ఇప్పటి వరకే జియోటవర్ ఉందని తద్వారా రేడియేషన్ ఉత్పత్తి అవుతున్నట్టు తెలిపారు. గ్రామంలో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు గర్భిణీ స్త్రీలకు వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. తమ పక్క గ్రామమైన మాల్ తుమ్మెద గ్రామం నుండి తమ గ్రామానికి ఎయిర్టెల్ సిగ్నల్ వస్తుందని, మరో టవర్ అవసరం లేదని తెలిపారు. విచారణ నిర్వహించిన మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఉన్నత అధికారులకు నివేదిక పంపనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, మల్లికార్జున్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

మానవత్వం చాటుకున్న పోలీస్


ఫోన్‌ను అప్పగిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి శుక్రవారం పోలీసులు ఫోన్ అందజేశారు. బాల్కొండకు చెందిన గణేష్ తన మొబైల్ ఫోన్ దారిలో పోగొట్టుకున్నాడు, ఉదయం అటువైపుగా వెళ్తున్న బాల్కొండ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పవన్‌కు ఆ మొబైల్ ఫోన్ దొరికింది. మానవత్వంతో వెంటనే మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు గణేష్‌కు సమాచారం అందించి అతని మొబైల్ ఫోన్‌ను ఏఎస్ఐ శంకర్ సమక్షంలో అందజేశారు. మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ పవన్‌ను పలువురు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న రమేష్ స్నేహితులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన అనికేశి రమేష్ గత కొద్ది రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన విషయం విదితమే.. ఆయన చిన్ననాటి మిత్రులు 2000-01 బ్యాచ్ విద్యార్థులు 25 వేల రూపాయలు సేకరించి మృతుడి భార్యకు శుక్రవారం అందజేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండడంతో రానున్న రోజుల్లో సైతం బాధిత కుటుంబానికి అండగా ఉంటామని రమేష్ స్నేహితులు అన్నారు. కార్యక్రమంలో మృతుడి స్నేహితులు జోగు నర్సయ్య, కె.రవి కుమార్, జైడి సాయిరెడ్డి, జాపు మహేశ్వర్, ఎ.రఘు, అనికేశి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్.. వినతి


వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న ఎంప్లాయిస్‌ని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏఓకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. నిజామాబాద్ జిల్లాలో పదిమందికి రాత్రికి రాత్రి డ్యూటీలకు నిలిపివేయడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి కుటుంబాలకు దూరంగా ఉంటూ అనేక రకాలుగా సేవలు అందించారని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్మనెంట్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో పనిచేసిన వీరిని తొలగించడం అన్యాయమని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో అందరిని యధావిధిగా కొనసాగించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన వీరిని తొలగించడంతో కుటుంబాలు వీధిన పడ్డట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు తొలగించడంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, శకుంతల, దివ్య, రేవతి, శ్రీలత, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా ఎన్నిక..
క్షత్రియ కులానికి గర్వకారణం

- జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు

నవతెలంగాణ-ఆర్మూర్

కర్ణాటక రాష్ట్రంలోని బిజెపి పార్టీకి చెందిన సీనియర్ నాయకులు క్షత్రియ (పట్కరి) కులానికి చెందిన బండగే నారయన్ రాజ్య సభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం శుభ పరిణామం అని క్షత్రియ కులానికి గర్వకారణం అని జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేధన్ గుజరాతి శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లయన్ నివేధన్ ఫోన్‌లో మాట్లాడి తెలంగాణ క్షత్రియ సమాజ్ నుంచి ఆర్మూర్, నిజామాబాద్ సమాజం నుంచి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. క్షత్రియ కులస్థులకు మొట్ట మొదటి సారిగా ఇట్టి అవకాశం రావడం శుభసూచకమని వారు కొనియాడారు. యావత్తు క్షత్రియ కులానికి చెందిన ప్రజలకు తమ వంతు సహాయ కార్యక్రమాలు చేస్తానని పేర్కొన్నారు.

5న పెన్షనర్స్ డివిజన్ సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆల్ పెన్షనర్, రిటైర్స్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ సమావేశం ఈ నెల 5న పట్టణంలోని ఆర్కే హాస్పిటల్ పక్కన నిర్వహించనున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు మాదరి సాయన్న, బొమ్మన శంకర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డివిజన్‌లోని కేంద్ర, రాష్ట్ర, ఈపీఎఫ్, లైబ్రరీ, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ తదితర శాఖల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. పెన్షనర్ల సమస్యలు, పిఆర్సి, హెల్త్ స్కీమ్, డివిజన్ కమిటీ పునర్వ్యవస్థీకరణ ఏ జెండా అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు బాబా గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీవోను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-వర్ని

మండల నూతన ఎండిఓ వెంకటేష్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేష్ బాబా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధితో పాటు గ్రామాలలో సమస్యలుపై చర్చించారు. వీరితో బీసీ సెల్ అధ్యక్షులు నరెడ్ల సాయిలు, ఎంపీవో చందర్ తదితరులు ఉన్నారు.

హాస్టల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేవ్

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆగ్రహం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని 36వ డివిజన్‌లో గల నాందేవ్‌వాడలో గిరిజన కళాశాల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాస్టల్లో మధ్యాహ్నం భోజనం, మంచినీరు, బాత్రూమ్ మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు హాస్టల్లో కనీసం మౌలిక సౌకర్యాలు లేవని, భోజనం సరిగా ఉండటం లేదని రోజు ఒకే కర్రీతో తింటున్నాం అని, మొఖాలు కడుక్కోవడానికి కూడా నీళ్లు లేవని 120 మందికి ఒక చిన్న వాటర్ ట్యాంక్ ఉందని, అది మున్సిపల్ వాటర్ రాక నానా ఇబ్బందులు పడుతున్నాం అని, బాత్రూంలలలో భరించలేని వాసన వస్తుందని ఎమ్మెల్యేకి తమ గోడును చెప్పుకున్నారు.

ఎమ్మెల్యే వెంటనే గిరిజన వెల్ఫేర్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ హాస్టల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేవని, విద్యార్థులకు మేను ప్రకారం భోజనం పెట్టాలని, బాత్రూమ్ అధ్వనంగా ఉన్నాయని, స్నానాలకు మంచినీటి కొరత విటన్నిటిపైన దృష్టిపెట్టి వారం రోజుల్లో విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లేని యెడల తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. త్వరలో ఈ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, సుదీర్, ప్రవళిక బిజెపి నాయకులు ప్రభాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలు


వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఇంద్రపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బిఆర్ శివప్రసాద్ పాల్గొన్నారు. సంత్ రవిదాస్ 300 సంవత్సరాల పూర్వం ఆధ్యాత్మిక వైపు దళిత సమాజాన్ని నడిపించిన విషయాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమానికి సహకరించిన అరవింద్ ధర్మపురి ఫౌండేషన్‌కి, శ్రీ చక్ర హాస్పిటల్ నిజామాబాద్, డాక్టర్ విశ్వతేజకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, సాయి పవర్, కిరణ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి చదివితే.. ఫలితం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం నీలా జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్ కుమారుడు శేషు (ఐఆర్ఎస్) శుక్రవారం 9, 10వ తరగతి విద్యార్థులకు గ్రూపు పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలనే విషయాలపై వారికి క్షుణ్ణంగా వివరించారు. డబుల్ ఐటి ఢిల్లీలో 2016 బ్యాచ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో విద్యనభ్యసించారు. యూపీఎస్సీ 2017, 18 బ్యాచ్‌లో 723వ ర్యాంకును సాధించి(ఐఆర్ఎస్) డిప్యూటీ కమిషనర్ ఆఫ్(జీఎస్‌టి) ఇంటిలిజెన్స్‌గా భువనేశ్వర్ ఒరిస్సాలో విధులను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నీల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు పాఠశాల తరపున ఉపాధ్యాయ బృందం వారికి కృతజ్ఞతలు తెలియజేసింది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య పదవ తరగతికి చెందిన 80 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పౌచులతోపాటు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు, వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్బయ్య, శ్రీనివాస్, గులాం హైమాద్, ఆనంద్, అపర్ణ, గణేష్‌కుమార్, స్వర్ణ, అనిల్, సిహెచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా రక్తదానం మిన్న

- ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ
- ఇందూర్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్-సిటీ

అన్ని ధానాలలో కన్న రక్తదానం మిన్న అని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ద్వారకానగర్‌లో భువన సమేక ట్రస్ట్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన ఇందూర్ బ్లడ్‌బ్యాంక్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. మొదటగా ఇందూర్ పేరుతో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేసిన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. మానవసేవే మాధవ సేవ అనే విధంగా రక్త దానంతో ఒక మనిషి ప్రాణాన్నే నిలబెట్టవచ్చు అని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కుతో పాటు, రక్తదానం బాధ్యతగా తీసుకొని ప్రతి మనిషి సంవత్సరానికి ఒకసారి రక్తదానం చేయాలని, అత్యవసర సమయాలలో బ్లడ్, బ్లడ్ కాంపొనెంట్స్ సేవలు ఈ బ్లడ్‌బ్యాంక్ ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఇందూర్ బ్లడ్‌బ్యాంక్ యాజమాన్యం డా.దామోదర్ రావు, డా.శ్రీశైలం, డా.శివప్రసాద్, డా.రాజేష్, డా.జీవన్ రావు, డా.వినయ్ శ్రీవాణి ధన్‌పాల్, డా.రాఘవేంద్ర స్రవంతి, కార్పొరేటర్స్ బైకన్ మధు, ప్రభాకర్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌తో ప్రజలకు మేలు

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నో సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న అదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్‌ల మధ్య రైల్వేలైన్ పనులు వేగంగా జరిగే అవకాశం ఉందని, దీంతో నియోజకవర్గ ప్రజలకు మేలు జరగనున్నట్టు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తెలిపారు. 136 కిలోమీటర్ల లైన్ పనులు జరగనున్నట్టు తెలిపారు. ఈనెల 4వ తేదీ సోమవారం అదిలాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని పర్యటనను జయప్రదం చేయాలని తెలిపారు. జిల్లాలోని పట్టణంతో పాటు బాల్కొండ నియోజకవర్గాలకు నిర్మల్, బోత్ నియోజకవర్గాల మీదుగా నేరుగా అదిలాబాద్‌కు రైల్వే లైన్ కనెక్టివిటీ కోసం నిధులు మంజూరు విషయమై అన్ని వర్గాల ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అన్నారు. ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు.

మాదిగ అమరులకు నివాళులు


నిజామాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్/కంఠేశ్వర్

సాలూర మండల కేంద్రంలో శుక్రవారం టీ-ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు డప్పుల చంద్రయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన అమరవీరుల ఆత్మ శాంతి చేకూరాలంటే కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాదిగ మేధావుల ఫోరం జిల్లా నాయకులు లింబూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కావాలంటే ఎస్సీ వర్గీకరణ ఒక్కటే మార్గమని అన్నారు. కావున తప్పనిసరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంటి, లక్ష్మయ్య, సుభాష్, సాయికుమార్, రవి, చందు, రాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ టౌన్ బోర్గం(పి) డా.బాబు జగ్జీవన్‌రామ్ వద్ద ఎంఎస్‌పి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి గంధమాల నాగభూషణం మాదిగ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యమ అమరులకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ ఉద్యకరుడిగా గంధమాల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994 జులై 7న ఏర్పడి నేటికి సుమారుగా 30సం అవుతుంది. ఎస్సీ వర్గీకరణ సాధనకై అలుపెరుగని పోరాటం, నాటి నుంచి నేటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల ఉద్యమంపై ద్వంద వైఖరి వల్ల, నిర్లక్ష్యం వల్ల, మోసపూరిత వైఖరి వల్ల మాదిగ యువత లక్ష్య సాధనలో భాగంగా ప్రాణాలను సైతం కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ఈ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలను వంచించాయే గాని మాదిగ జాతికి న్యాయం చేయకపోవడం వల్ల విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. కావున ఇప్పటికైనా పార్లమెంట్ ఎన్నికలలోపే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని లేనియెడల, అమరుల దినోత్సవం సాక్షిగా వారి ఆశయాలను సాధించే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వదిలే ప్రసక్తే లేదని అన్నిరు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా సీనియర్ నాయకుడు డల్లా సురేష్ మహాజన్, కార్యక్రమంలో పాల్గొన్నవారు. పట్టణ అధ్యక్షుడు శివ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సురేష్, ఉద్యోగస్తుల అధ్యక్షులు సురేష్, మాజీ అధ్యక్షులు తెడ్డు గంగారాం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు క్రిస్టియన్ మాదిగ, మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్పలత, మహిళా నాయకురాలు సావిత్రి, ఎంఈఎఫ్ గంగారాం, రాములు, తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో..

ఆర్మూర్ ఏసీపీకి సన్మానం


ఏసీపీని సన్మానించిన జర్నలిస్టులు

నవతెలంగాణ-బాల్కొండ

ఆర్మూర్ నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన బస్వారెడ్డిని సీనియర్ జర్నలిస్టులు శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీగా బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో బస్వారెడ్డి బాల్కొండ ఎస్సైగా, ఆర్మూర్ సీఐగా పనిచేసిన అనుభవాలను జర్నలిస్టులతో నెమరు వేసుకున్నారు. కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ షేక్, రహీముద్దీన్, సీనియర్ జర్నలిస్టులు నరేందర్, మురళి, హరీష్ ఉన్నారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సాయి ఎన్నిక


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ (ఐఎన్‌టియుసి) రాష్ట్ర 55వ మహాసభలు ఇటీవల యాదగిరి గుట్టలో జరిగింది. ఈ సమావేశంలో జరిగిన ఎన్నికలలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ యూనిట్ అధికారి సాయి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌లు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు. సాయి మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర స్థాయిలో పదవిని ఇవ్వడం చాలసంతోషంగా ఉందని అలాగే రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏమైనా సమస్యలు ఉంటే రాష్ట్ర నాయకత్వానికి తీసుకవెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

3న విప్లవ పార్టీల విలీన
ఐక్యతా మహాసభ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిసిసి, సిపిఐ (ఎంఎల్) రివల్యూషనరి ఇన్షియేటివ్, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా 03 పార్టీల విలీనం సందర్భంగా 2024 మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐక్యతా మహాసభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. వాల్‌పోస్టర్లను సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న దేశ పెట్టుబడిదారీ విధానం విసిరే సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవోద్యమం సైతం మార్పులు చేసుకోవాల్సి ఉందన్నారు. ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికై దేశవ్యాప్తంగా ఒక శక్తివంతమైన సైతాంతిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. ఆ కృషి కొనసాగింపే మూడు పార్టీల ఐక్యత అని అన్నారు. 14 రాష్ట్రాలలో, వివిధ స్థాయిలలో పనిచేసే సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ (ఎం.ఎల్), సీపీఐ(ఎం.ఎల్) ఆర్.ఐ మూడు పార్టీలు కలిసి చర్చించుకుని ఒక అవగాహన ఏర్పరచుకొని ఐక్యం కావాలని నిర్ణయించుకున్నాయన్నారు. 2024 మార్చ్ 3 న ఖమ్మంలో వేలాది మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది తరలి వస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు విప్లవ అభిమానులు జయప్రదం చేయాలని, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యతా మహాసభకు మద్దతు తెలియజేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు విటల్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించాలి

- రాహుల్‌గాంధీకి నరేశ్ వినతి


రాహుల్ గాంధీని కలిసిన నరేశ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తనకు ఎంపీ టికెట్ కేటాయించాలని నగరంలోని కోటగల్లికి చెందిన మేడిచెట్టి నరేశ్ రాహుల్‌గాంధీని కలిసి విన్నవించుకున్నారు. లండన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వచ్చిన రాహుల్ గాంధీని శుక్రవారం కలిసి కోరినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి నిజమాబాద్ ఎంపీగా పోటీ చేస్తానని రాహుల్ గాంధీ గారినీ కోరాను , ఎన్ఎస్‌యూఐ మూలాల నుండి వచ్చానని, తనకు ఈసారి అవకాశం ఇస్తే మెజారిటీ ఓట్లు బడుగు బలహీన వర్గాలవి దక్కే అవకాశం ఉందని తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి షేక్ సలాం, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత


విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని రాంపూర్ (కలన్)ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవంను పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్ మేళాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విఠల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ అనే సబ్జెక్టు నిజ జీవితంలో వాడే పరికరాలను తయారు చేయడంలో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులకు నిర్దేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు స్వరూప, ప్రసన్న, సాయిబాబా, నయూమ్, రాజు, కృష్ణగౌడ్, వేద ప్రకాష్, మల్లేష్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపాల్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర దోసకాయ.. భలే డిమాండ్

- 50 కేజీల సంచి రూ.600
- రోజురోజుకూ ధర పైపైకి
- ఈ ఏడు తగ్గిన దిగుబడి
- ఆనందంలో రైతులు

నవతెలంగాణ-జుక్కల్

ఎర్ర దోసకాయకు డిమాండ్ నెలకొంది. రోజురోజుకూ ధర అమాంతం పెరుగుతోంది. 50 కేజీల సంచి రూ.600 ధర పలుకుతోంది. గతేడాది ఈ పంటను అధిక మొత్తంలో సాగుచేసిన రైతులు.. ఈ యేడాది పూర్తిగా తగ్గించేశారు. దీంతో ధర అమాంతం పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

మండలంలో దోసకాయ పంటను అంతర పంటగా రైతులు పండిస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌లో పంటసాగుకు అనుకూలం కావడంతో జొన్న పంట, లేక ఇతర పంటలతో కలిపి అంతర పంటగా పండించడం అనవాయితీ. పెద్ద జొన్న పంటలో అంతర పంటగా వివరిగా పండించే రైతులు గతేడాది దోసకాయ పంట దిగుబడి బాగా వచ్చింది. గతేడాది ధర అంతంత మాత్రమే రైతుకు అందింది. ప్రస్తుతం పంటసాగు తగ్గించిన రైతులు ఈ ఏడు పంట దిగుబడి తగ్గడంతో ధర అమాంతం పెరిగింది. గతేడాది సంచి 50 కిలోలు సుమారుగా మూడు నుంచి నాలుగు వందలు పలికితే.. నేడు ధర రెట్టింపుతో సంచి రూ.600 ధర పలుకుతోంది. రైతులు దోస పంటను పండించేందుకు సుముఖంగా లేకపోవడంతో పాటు సరైన సమయానికి పంట కోత చేసి అమ్మితేనే మార్కెట్‌లో నాణ్యత సైజును బట్టి ధరను నిర్ణయిస్తారు.

పలు రాష్ట్రాలకు సప్లయ్..

ఇక్కడ పండించిన దోసకాయ ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు పంపిస్తున్నారు. దూరం ఎక్కువైనా అక్కడ ధర బాగా పలుకడంతో ఎక్కువగా దళారులు, వ్యాపారులు, రైతులు అక్కడికి తరలిస్తారు.

ధర పలకడం కలిసివచ్చింది



రెండెకరాల్లో అంతర పంటగా దోసకాయ పండించాను. వాతావరణంలోని మార్పుల వలన దిగుబడి తగ్గింది. ఎకరాకు 30 సంచులు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 10-12 సంచులు వచ్చింది. ధర ఎక్కువగా పలకడంతో కలిసి వచ్చింది.

– హంగర్గ రైతు, శివరాం గొండ



జీరో పెట్టుబడి..

దోసకాయ పంట సాగుకు పాత కాలం నాటి విత్తనాలే ప్రస్తుతం మండలంలో ఉపయోగంలో ఉంది. రైతులు పూర్వీకుల విత్తనాలనే ఇష్టపడుతారు. పెట్టుబడి విషయంలో చాలా తక్కువగా ఉంటుంది. ఒక సారీ విత్తుకుని జాగ్రత్తగా కలుపు తీస్తే ఎక్కువ లాభాలను పొందవచ్చు. ఎటువంటి చీడపురుగుల బెడద ఉండదు.

ఔషధ లక్షణాలున్న దోసకాయ పంట..

ఈ పంటకు బయటి నుంచి ఎటువంటి ఎరువులు, రసాయనాలను వాడకపోవడం, నీరు లేకున్న పండుతుంది. కాబట్టి ఎటువంటి రసాయనాలు వాడాల్సిన అవసరం లేదు. చీడపురుగుల బెడద ఉండదు. ఎండకు తట్టుకుని పండుతుంది. దోసకాయలను కోసి గింజలను వేరు చేసి ఎండపెడతారు. నూనె తీసి పలు ఔషధాల వాడకంలో ఉపయోగిస్తారు. నీటిశాతం ఎక్కువగా ఉండటం వలన ఆకలి, దాహం పచ్చిదోసకాయ తింటే అంతాసర్దుకుపోతుంది.

రైతులకు మొబైల్ యాప్ పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

జాతీయ పురుగు, తెగులు నిఘా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఎతిక్కనూరు పట్టణంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతులకు ఎన్.పి.ఎస్.ఎస్ మొబైల్ యాప్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల లోని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత రైతులకు శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ పురుగు మరియు తెగులు నిఘా సంస్థ రూపొందించిన మొబైల్ యాప్ వినియోగంపై రైతులు ఏ విధంగా వాడుకోవాలో అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ అపర్ణ, వ్యవసాయ అధికారి రాధ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ తండాలో వాటరింగ్ డే


వాటరింగ్ డేలో పాల్గొన్న ఎంపీడీవో, ఏపీవో

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని జగదాంబ తండాలో శుక్రవారం ఎంపీడీవో సవిత రెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి తో కలిసి వాటరింగ్ డే లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సవితారెడ్డి మాట్లాడుతూ... నాటిన మొక్కలను సంరక్షించేందుకు వేసవిలో తప్పకుండా నీరందించాలని సూచించారు. మొక్కలు నాటే సమయానికి నరసరిలో మొక్కలను ఏపుగా పెంచి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవింద్ రెడ్డి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-రాజంపేట్

ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మెట్ల బావిని పరిశీలించి మాట్లాడారు. ప్రాచీన కాలంలో నిర్మించిన బావి శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని దాతల సహకారంతో బాగు చేయిస్తామన్నారు. పూడిక తీస్తే భూగర్భ జలాలు ఈ ప్రాంతంలో పెరిగే అవకాశం ఉందని సూచించారు. శ్రమదానం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ప్రతినిధులు, దాతలు ముందుకు రావాలన్నారు. అందరం కలిసి పురాతన కట్టడాలను కాపాడుకోవాలని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

కానరాని పల్లెవెలుగు బస్సు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్ గల్ మండలంలోని అనేక గ్రామాలకు ఇప్పటికి పల్లె వెలుగు బస్సు సౌకర్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. మండలంలోని దాదాపు 23 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 3 గ్రామలకే బస్సు సౌకర్యం కలదు. మిగిలిన 20 గ్రామ ప్రజలకు ఎక్కడికి వెళ్లాలన్నా ప్రయివేటు వహనాలే దిక్కు ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో మండల కేంద్రానికి లేదా ఇతర ప్రాంతాలకు వెళ్ళలంటే గ్రామీణ ప్రాంతాలలో ప్రయివేటు ఆటోల కోసం గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తుందని, లేకుంటె ఎక్కువ నగుదు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. వేల రూపాయలు చెల్లించి ప్రవేటు వాహనాలను అద్దెకు తీసుకొని వెళ్లవలసిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామీణ పేద ప్రజలు వేల రూపాయలు చెలించలేక ఆటోల కోసం గంటల కొద్దీ ఎదురుచూడక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతి సారి రాజకీయ నాయకులు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం గెలిచిన తర్వాత మర్చిపోవడం ఆనవాయితీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి శాసన సభ్యులు హన్మంత్ షిండే నవతెలంగాణ లో వచ్చిన కథనాలకు మండల ప్రజల కోరిక మేరకు మండల కేంద్రం నుండి బాబుగావ్ గ్రామానికి కొన్ని రోజులు బస్సు సౌకర్యం కల్పించారని, కానీ అది కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాని పరిస్థితి లో ఆ బస్సు కూడా కొన్ని రోజులకే బస్సు సేవలను ఆపివేయడంతో బాబూల్ గావ్ నుండి మండల కేంద్రం వరకు సుమారు 12 గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలంటే బిచ్కుంద, పిట్లం, బాన్సువాడ లాంటి పట్టణాలకు వెళ్ళవలసిన ఉండగా బస్సు సౌకర్యం లేక చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంత్ రావు గత నెలరోజుల క్రితం మండలసర్వ సభ్య సమావేశంలో బస్సు సౌకర్యం కల్పించలాని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకురాగా వెంటనే స్పందించి ఆర్టీసీ అధికారులను మండల ప్రజలకు బస్సు సేవలను అందించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. నెల రోజులు గడుస్తున్నా బస్సు సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామీణ వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులా..? నాయకులా.?

- ప్రచారంలో ప్రజా ప్రతినిధులను మించిన ఉద్యోగులు
- సంఘాల పేరుతో ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు



ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులను, నాయకులను మించిపోతున్నారు అనడంలో సందేహం లేదు. ఏ చిన్న కార్యక్రమం జరిగినా కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల హడావిడి ఎక్కువగా ఉంటుంది. యాంకరింగ్ చేయాలన్న పోస్టర్లు వేసుకోవాలన్న ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులే ఉంటున్నారు. గత నాలుగు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్ అలీ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయావరణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇప్పటివరకు తొలగించలేదు. దీంతో మీరు ప్రభుత్వ ఉద్యోగుల ప్రజాప్రతినిధుల అనే సందేహాన్ని పలువురులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల కార్యాలయంలో సైతం బీరువాల పై పూర్తిగా సంఘాల ఫ్లెక్సీలతో నింపేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆ ఫ్లెక్సీని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సమాజ మార్పునకు యువతే కీలకం

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

సమాజ మార్పుకు యువతే కీలకమని, యువతను సన్మార్గంలో నడిపించవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 10వ తరగతి సన్నద్ధ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం వహించిందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెగా డీఎస్సీని నోటిఫికేషన్ వేసి, ఉపాధ్యాయ నియామకాలను చేపడుతుందని, దీని ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఒత్తిడి లేకుండా, మండలాన్ని జిల్లాలో మొదటి వరుసలో నిలిచేల ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మండల కేంద్రంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. మండలంలోని పోసానిపేట శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడిగంటలు శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తూ మోహన్ రెడ్డికి, ఎస్పై కొండ విజయ్‌లకు ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ అందజేసింది. కార్యక్రమంలో ఎంఈఓ యోసేఫ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆలయ కమిటీ చైర్మన్ బండి పోచయ్య, కాంగ్రెస్ నాయకులు నా రెడ్డి రాజు రెడ్డి, నామాల రవి, తూర్పు రాజు, బి పేట నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడ్


అంగన్‌వాడీలో పోషణ పక్వాడ్ నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సోఫూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సులోచన ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలీంతలకు, గర్భిణిలకు, చిన్న పిల్లల తల్లులకు సమావేశం నిర్వహించి పాషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఆశావర్కర్ బాలమణి మాట్లాడుతూ.. పిల్లలకు టీకాలు సమయానుకులంగా ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహరం తప్పక తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ సులోచన మాట్లాడుతూ.. గుడ్లు, బాలమృతం, పాలు తప్పక రెగ్యులర్‌గా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి రావాలని కాలినడకన తిరుమల దర్శనం

నవతెలంగాణ-సదాశివనగర్

మదన్‌మోహన్‌కు మంత్రి పదవి రావాలని ఆకాక్షిస్తూ తిరుపతి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి కోరుకున్నట్టు జిల్లా సేవాదల్ అధ్యక్షుడు బొంబౌతుల లింగాగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, సర్పంచ్ సంగారెడ్డి,రాజిరెడ్డి, ముత్యం, అశోక్ రెడ్డి, బాలరాజు, చందరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా బీటీ రోడ్డు

- ఈ ప్రభుత్వంలోనైనా పూర్తి అయ్యేనా?


అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్ గల్ మండలంలోని అంజని గ్రామం నుండి పోచారం తాండ వరకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మాణం చేసి దాదాపు ఐదు సంవత్సరాల కాలం పూర్తయినా అంజని-శివాపూర్ గ్రామ మధ్యలో సుమారు 800 మీటర్ల రోడ్డును బీటీ వేయకుండా అలాగే వదిలేసింది. గతంలో మిగిలిన రోడ్డును పూర్తి చేయాలని అప్పటి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ను ఇక్కడి ప్రజలు పలుమార్లు విన్నవించగా 800 మీటర్ల రోడ్డు అటవీశాఖలో ఉన్నందున బీటీ వేయకుండా మిగిలిపోయిందని వెంటనే అటవీశాఖ అధికారుల నుండి అనుమతి తీసుకొని పనులు పూర్తి చేసే విదంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడమే తప్ప ఇప్పటి వరకు అటవీశాఖ అధికారుల నుండి అనుమతులు రాకపోవడంతో ప్రయాణికులు కంకరా తేలిన రోడ్డు మీదనే ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా గడచిన అటవీశాఖ అధికారుల నుండి అనుమతి తీసుకొని రోడ్డు వెయ్యకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్ రావు మండలంలో గత నెలలో స్వర సభ్య సమావేశానికి హాజరుకావడంతో రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఆయన దృష్టికి పలువురు నాయకులు తీసుకెళ్లగా సంబంధించిన శాఖ అధికారులకు అసంపూర్తిగా మిగిలిన రోడ్డును త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఏది ఏమైనా ఇటు అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రజల కష్టాలను దూరం చేయాలని కోరుతున్నారు.

15ఫైనాన్స్ నిధులు విడుదల చేయండి


వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

15 ఫైనాన్స్ నిధులు, స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ అనితను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు రాష్ట్ర జెడ్పిటిసిల ఫోరం ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాదులో గల పంచాయతీ రాజ్ కార్యాలయంలో కమిషనర్‌లు కలిసి వినతి పత్రం సమర్పించినట్టు ఆయన పేర్కొన్నారు.

వికలాంగులకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-నిజాంసాగర్

వికలాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలని ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రైమర్ స్కూల్ మహ్మద్ నగర్ నందు విద్యానభ్యాసిస్తున వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్దనే చిన్నచిన్న వ్యాయామ ఆసనాలను చేయించినట్లయితే వారి అవయవ లోపము క్రమేపి తగ్గుదల ఉంటుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టి గైని చిన్న సాయిలు, సిఆర్పి శంకర్‌గౌడ్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠదామ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలి సంఘం స్మశాన వాటికలో 'వైకుంఠ దామ నిర్మాణం' కోసం శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల ద్వారా రూ.4 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు సంఘ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ ఉపాధ్యక్షులు శీను, రఘు, సెక్రటరీలు దినేష్, నరేష్, సంఘ సభ్యులు పెంటు గంగాధర్, రవీందర్, కమలాకర్, రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ప్రతినిధులు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఎంపీఓ శివ చరణ్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఎంపీఓ శివ చరణ్ శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం వస్తున్నందున గ్రామాల్లోని ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని, దీని కోసం కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యూ.ఏఈ స్వరాజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

హెూమ్ గార్డ్‌కు వీడ్కోలు



సన్మానిస్తున్న పోలీస్ అధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ హెూమ్ గార్డ్స్ విభాగంలో మార్చ్ 1న పదవి విరమణ చేసిన బి. సాయన్ రావ్‌కు వీడ్కోలు సమావేశం సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వీరికి శాలువలతో సత్కరించి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించడం జరిగినది. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎలాంటి రిమార్క్ లేకుండా పదవివిరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని, డిపార్టుమెంట్‌కు చేసిన సేవలు ఎంతో ఘనసీయమని, పదవి విరమణ అనంతరం ఎలాంటి అవసరం వచ్చిన ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సహాయపడతామని భరోసా కల్పించారు. ఈ వీడ్కోళ్లు సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్స్పెక్టర్స్ వెంకట్, రమేష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కంపెనీ కమాండర్ సయ్యద్ బషీర్ అన్వర్ వారి కుటుంబ సభ్యులు హాజరు అయ్యారు.

తెలంగాణ నుండి రాహుల్ పోటీ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఉత్సాహంగా, హుషారుగా ముందుకు వెళ్లాలంటే రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయాలని లండన్ కాంగ్రెస్ ఓవర్సీస్ ఉపాధ్యక్షులు ఆర్ సుధాకర్ గౌడ్ కోరారు. లండన్‌కు వచ్చిన రాహుల్‌గాంధీని కలిసి విన్నవించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి నాయకత్వాన, బట్టు మల్లు విక్రమ నాయకత్వాన, ఇతర సీనియర్ మంత్రులు ఆధ్వర్యంలో రాబోయే ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రం నుండి రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించాలని దీంతో రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలిచే అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా తెలంగాణ నుంచి పోటీ చేస్తే ఆ ప్రభావం తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రాభల్యం పెరుగుతుందని వెల్లడించారు.


వినతి పత్రం అందజేత

ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు సొసైటీ తీర్మానం


మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల సొసైటీ ద్వారా ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు శుక్రవారం తీర్మానం చేశారు. ఛైర్మన్ మగ్గరి హన్మాన్లు అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించగా సొసైటీ స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పాటు రైతుల సహాయార్థం సొసైటీలోనే సేవింగ్ ఖాతాల లావాదేవీలు బంగారు రుణాలు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఖాజా ఆశముద్దీన్ డైరెక్టర్లు అంజా గౌడ్, ప్రదీప్ రావు, బాలచందర్, మనోహర్ రావు, నవీన్ రావు, గంగాధర్, సంపూర్ణ, సాయన్న మరియు సీఈవో రమేష్ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు

టెట్‌లో అర్హత మార్కులు తగ్గించాలి

నవతెలంగాణ-మోపాల్

ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం ముందుగా నిర్వహించే ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కు అర్హులైన అగ్రవర్ణ పేదలకు కూడా బీసీ అభ్యర్థుల మాదిరిగా అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి ,స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి కోరారు. తెలంగాణ జేఏసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి కటాఫ్ మార్కులు తగ్గించాలని కోరినట్టు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే ముందుగా ప్రతి ఒక్క బీఈడీ, టిటిసి చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించాల్సి ఉంది. కావున ఈ ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఓసి అభ్యర్థులకు 90 మార్కులు, బీసీ అభ్యర్థులు 70 మార్కులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 60 మార్కులు సాధించాలి. దీంతో 89 మార్కులు సాధించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులు, ఉపాధ్యాయ పోస్టుల కొరకు నిర్వహించే పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది. కావున ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్ కు అర్హత కలిగిన అగ్రవర్ణ పేదలకు కూడా బీసీ అభ్యర్థుల మాదిరిగా 75 మార్కులకే టెట్ అర్హత పరీక్ష మార్కులు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించి అర్హులైన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి కోరారు.

గ్రామాల్లో సోలార్ వెలుగులు

- విద్యుత్ ఉత్పత్తితో పాటు విక్రయించుకునేందుకు అవకాశం
- ఒక కేవీకి రూ.30 వేలు సబ్సిడీ.. గరిష్టంగా రూ.78 వేలు
- పూచీకత్తు లేకుండా బ్యాంక్ రుణాలు అందజేత
- తపాలశాఖ సిబ్బందికి లబ్దిదారుల ఎంపిక బాధ్యత

నవతెలంగాణ-ఏర్గట్ల

కోటి కుటుంబాలకు ప్రతి నెలా 300 యూనిట్లలోపు ఉచిత కరెంట్ ఇవ్వాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనకు శ్రీకారం చుట్టగా.. కేంద్ర కేబినెట్ దీనికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాలుష్య నివారణకు సహజ వనరులను కాపాడుకునేందుకు గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడాని కోసం కేంద్రం ఈ పథకం ద్వారా దృష్టిసారించింది. ఈ పథకాన్ని తపాలా సిబ్బంది సహకారంతో లబ్దిదారులను ఎంపిక చేసే బాధ్యతలను అప్పజెప్పింది.


సోలర్ ప్లాంట్

పథకానికి ఎవరు అర్హులు..

స్వంత ఇల్లు కలిగి ఉండి, విద్యుత్ మీటర్ ఉన్నవాళ్ళు ఈ పథకానికి అర్హులు..

ఎన్ని కిలో వాట్లకు ఎంత రాయితీ..

నెలలో 0 నుంచి 150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారు 2 కిలో వాట్ల సోలార్ పలకలను, 150 నుంచి 300 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారు 3 కిలో వాట్ల పలకలను అమర్చుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2 కిలో వాట్ల సోలార్ పలకలపై రూ.30వేల నుంచి రూ.60 వేల వరకు, 3కిలో వాట్ల పలకలపై రూ.60 వేల నుంచి రూ.78వేల వరకు లబ్దిదారునికి రాయితీ ఉంటుందని తెలిపింది.

విద్యుత్ విక్రయించుకోవచ్చు..

సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే క్రమంలో సబ్సిడీ పోను.. మిగతా డబ్బులకు బ్యాంక్‌లు పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వనున్నట్టు కేంద్రం ప్రకటించింది. సోలార్‌తో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో ఇంటి అవసరాలకు పోను.. మిగతా విద్యుత్‌ను విక్రయించుకోవచ్చని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు. 2 కేవీ కెపాసిటీతో యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 300 యూనిట్‌ల వరకు ఇంటి అవసరాలకు వినియోగించుకొని మిగతా 600 యూనిట్‌లను నెట్ మీటరింగ్ ద్వారా విక్రయిస్తే.. నెలకు 1200 రూపాయలు రానున్నాయని, వీటితో బ్యాంక్ రుణం చెల్లించుకునే వెసులుబాటు సైతం కల్పించారు.

దరఖాస్తు ఎలా..?

సోలార్ ప్లాంట్ ఏర్పాటు దలచుకునే వారు నేరుగా https://pmsuryaghar.gov.in వెబ్ సైట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న కరెంట్ బిల్ ఆధారంగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత డిస్కం నుంచి అనుమతి రావాల్సి ఉంటుంది. దీంతో పాటు తపాలా శాఖ సిబ్బంది సహకారంతో లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది. తపాలా సిబ్బంది ఈ పథకాని కోసం ఇంటికి సర్వేకు వచ్చినప్పుడు ఇంటి యజమాని అంగీకరిస్తే, ఇంటి యజమాని విద్యుత్ బిల్లు, లబ్దిదారుని ఫోన్ నంబర్, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఈ పథకానికి అర్హుడిగా గుర్తించనున్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మార్చ్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని తపాలా శాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తితో పాటు విక్రయించొచ్చు

ఎట్టెం దశరథం, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, ఏర్గట్ల



స్వంత ఇల్లు కలిగి, మీటర్ ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. లబ్దిదారుడికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విక్రయించవచ్చు. లబ్దిదారుని అంగీకారం తోనే ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. దీని కోసం యజమాని పేరు, విద్యుత్ బిల్లు, ఫోన్ నంబర్, ఇతర వివరాలు అవసరమవుతాయి. మార్చ్ 8 వరకు ఎంపిక జరుగుతుంది. పూర్తి వివరాలను బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో తెలుసుకోవచ్చు.

కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదు


మాట్లాడుతున్న తాహెర్ బీన్ హందాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎంపీ అరవింద్ కాంగ్రెస్ పార్టీపై చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బీన్ హందాన్ అన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి కాదని ఎద్దేవ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బీన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ కమిటీ కేశ వేణు విలేకరల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశ సంపదను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలను బిజెపి మూసివేసిందని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా ఉన్న ఉద్యోగులను కూడా ఉద్యోగాల నుండి తీసివేస్తూ నిరుద్యోగులుగా మార్చే ప్రక్రియ బిజెపి చేసిందని ఆయన అన్నారు. 2018లో పార్లమెంటు ఎన్నికలకు ముందు బోధన్ నుండి మెట్‌పల్లి వరకు బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని, చెరుకు రైతులకు మాట ఇస్తూ పాదయాత్ర చేసిన అరవింద్ ఈ నాలుగున్నర సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వంతో గాని రాష్ట్ర ప్రభుత్వం గానీ ఏ రోజు కూడా ఎందుకు బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదేవిధంగా పసుపు రైతులకు ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చిన విధంగా పసుపు బోర్డు ఎందుకు తీసుకురాలేదని, పసుపు బోర్డు విషయం కేవలం పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని, ఆచరణలో ఇప్పటివరకు మొదలు కాలేదని కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి అబద్ధపు మాటలు మాట్లాడుత "న్నారని ఆయన అన్నారు. పసుపు ధర 14 వేల రూపాయలు కేవలం మా వల్లనే పలుకుతుందని అరవింద్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్వింటాల్ పసుపు 17 వేల రూపాయలకు పలికినట్టు గుర్తు చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిజామాబాద్ జిల్లాలో 60 వేల ఎకరాల పసుపు సాగు భూమి ఉంటే ప్రస్తుతం పసుపు సాగు చేసే భూమి 22 వేల ఎకరాలకు పడిపోవడం బీజేపీ పాలనకు నిదర్శనం అని ఆయన అన్నారు. మైక్ దొరికింది కదా అని కేవలం కాంగ్రెస్ పార్టీని తిట్టడం ఇష్టం వచ్చింది మాట్లాడడం సరికాదని ప్రజలకు పనికొచ్చే పనులు చేయాలని ఎంపీ అరవింద్ కు అదే విధంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి హితవు పలికారు. నిన్న మొన్నటి వరకు బిజెపితో సంబంధం లేని రాకేష్ రెడ్డి ఇప్పుడు బోధన్ వెళ్లి సుదర్శన్ రెడ్డిపై మాట్లాడటం తగదని, ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు సేవ చేసిందని సుదర్శన్ రెడ్డి ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల మనిషిగా పేరు పొందిన వ్యక్తి అని, కానీ కేవలం స్వార్థాల కొరకు రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా ఒకసారి ఎన్నికైన రాకేష్ రెడ్డి కాంగ్రెస్ పై మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఆయన అన్నారు. బిజెపి కేవలం మతాలతో యువకుల మధ్య చిచ్చులు పెడుతూ యువతను మతం పేరుతో రెచ్చగొడుతుందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా చేస్తున్నారని, దేశంలో న్యాయం నిలబడాలని అన్ని వర్గాల ప్రజలు అన్ని కులాల ప్రజలు అన్ని మతాల ప్రజలు సమానమేనని, ప్రజలందరూ ఏకం కావాలని రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, భక్తవత్సలం ,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణురాజ్, రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు జావేద్ అక్రమ్, పిసిసి మాజీ కార్యదర్శి రాంభూపాల్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ ,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కైసర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పరిధిలో

పీజీ, ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ మరియు అనుబంధ కళాశాలల పీ.జీ. మొదటి సెమిస్టర్ (ఎంఏ, /.ఎం. కాం / ఎంఎస్‌డబ్ల్యూ / ఎంఎస్సీ/ ఎంబీఏ./ ఎంసీఏ), ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల (ఏ.పి.ఈ/ ఐ.పి.సిహెచ్ / ఐఎంబీఏ/)7వ, సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు 5 వ రోజున ముగిసాయి. శుక్రవారం జరిగిన పరీక్షకు ఉదయం 1283 మంది విద్యార్థులకు 1205 మంది విద్యార్థులు హాజరయ్యారు. 78 మంది విద్యార్థులు గైరాజరు అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ట్రైనీ కలెక్టర్ పర్యటన


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం పర్యటించారు. జాతీయ ఉపాధి హామీ, మహిళా సంఘాల పనితీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో గల ఉపాధి హామీ నర్సరీ, లింగం గుట్టలో నిర్వహిస్తున్న కందకం పనులను పరిశీలించి. కూలీలకు చెల్లింపులు కొలతల గురించి తెలుసుకున్నారు. అనంతరం రైతు వేదికలో మహిళా సంఘాల లావాదేవీలు, నిర్వహణ తదితర అంశాలను మహిళా సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాయ గౌడ్, డి పి ఎం నీలిమ, ఎంపీడీవో నాగనాథ్, ఏపిఎం భూమేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో దినదినాభివృద్ధి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని గురుకులంలో దాతల సహాయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపల్ సహాసిని రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు సహకారం చేసిన దాతల వివరాలు వెల్లడించారు. అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచందర్ సుమారు 25 లక్షల వ్యాయన్ని పాఠశాలకు వెచ్చించి సైన్స్ ప్రయోగశాల నిర్మాణ పనులు దగ్గరుండి పూర్తి చేయించినట్టు తెలిపారు బాలికలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకుగాను, బాలికలు ఉన్నత చదువులు చదివేందుకు బాలికలకు తెలివితేటలు వచ్చేందుకు బాలికల సౌకర్యమేరకు గ్రంథాల నిర్మాణ పనులను బాలచందర్ శంకుస్థాపన చేశారు. గ్రంథాల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు స్లాబ్ లెవల్ వరకు చేరుకున్నాయి. సైన్స్ ప్రయోగశాలలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, అందుబాటులో ఉన్నాయి. 20 మందికి ఒక ఉపాధ్యాయులు చొప్పున అటు సబ్జెక్టుపై, అదే సబ్జెక్టుపై ప్రాక్టికల్ ను బాలికలకు నేర్పిస్తున్నారు. ఎన్నారైలతో పాటు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్టు తెలిపారు.

సుదర్శన్ రెడ్డి సూచన మేరకు ఎడపల్లి మాజీ జెడ్పిటిసి పులి శ్రీనివాసరావు, ఎడపల్లి మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రామ్మోహన్, బాలికల తల్లిదండ్రులు సైతం పాఠశాల కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. ఇంతింతై వటుదింతై అన్న రూపంలో తమ పాఠశాల కళాశాలలో చదివే పేద విద్యార్థుల మౌలిక సౌకర్యం కోసం దాతలు ముందుకు వచ్చి సహకరించడం పట్ల వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు.


పనులు జరుగుతున్న దృశ్యం


ల్యాబ్

పార్టీ మారుదాం..!

- ఉమ్మడి మండలంలో బీఆర్ఎస్ నాయకుల సమాలోచనలు



నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలోని సాలూర, బోధన్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. త్వరలో బిజెపి పార్టీలో చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటినుండి ఏ కార్యక్రమంలో పాల్గొనకుండా సొంత పనులలో నిమగ్నమయ్యారు. ఈ దశలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పార్టీ పెద్దలు ఆదరించకపోవడంతో వారు బిజెపిలో చేరడానికి సిద్ధమైనట్లు సమాచార . ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మిగిలిన కొంతమంది బిజెపిలో చేరడానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిసింది. ఏదేమైనా బోధన్ నియోజకవర్గంలో కారు పార్టీ పూర్తిగా తన ఉనికిని కోల్పోయేలా తయారైంది. త్వరలో ఎంపీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బోధన్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ ప్రజాప్రతినిధికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడానికి పార్టీ నిర్ణయించినట్లు సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగాలలో హ్యాట్రిక్ వీరుడు లక్ష్మణ్


తల్లిదండ్రులతో లక్ష్మణ్

నవతెలంగాణ-నవీపేట్

ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గగనమైన ఈ రోజుల్లో ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి హౌరా అని ఆశ్చర్య చకితులను చేశారు నవీపేట్ మండలంలోని కోస్లి గ్రామానికి చెందిన మేతరి లక్ష్మణ్. తండ్రి మేతరి లక్ష్మన్న, తల్లి గంగవ్వ లది వ్యవసాయ కుటుంబం. ఏడుగురు సంతానంలో చివరివాడైన లక్ష్మణ్ కుటుంబంలో చదువుకున్నవారు పెద్దగా ఎవరు లేకపోయినా పట్టుదలగా ఎంఏ బీఈడీ చదివాడు. 2014 నుండి ఎంట్రెన్స్ రాసేందుకు సిద్ధమైన నోటిఫికేషన్ లేకపోవడంతో దశాబ్ద కాలం వేచి చూడాల్సి వచ్చింది. ఇటీవల గురుకుల బోర్డు విడుదల చేసిన ఫలితాలలో వారం రోజుల వ్యవధిలోనే జేఎల్, పిజిటి, టీజీటీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి హ్యాట్రిక్ వీరుడిగా నిలిచాడు. క్రమశిక్షణ, అంకితభావం సాహసమే లక్ష్యంగా చదవడంతోనే సాధ్యమైందని భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని మేతరి లక్ష్మణ్ తెలిపారు. తల్లిదండ్రులతో పాటు భార్య నిత్యశ్రీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

నీరు నిల్వ ఉంటే రోగాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను, నీటినిల్వ గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాడైన వస్తువులలో నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన వస్తువులలో ఎక్కువ రోజుల నుంచి నీరునిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటింటికి మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం

- **గురుకుల లెక్చరర్ గా ఎంపికైన భాగ్యలక్ష్మి**

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


భాగ్యలక్ష్మి

తెలంగాణ గురుకుల కళాశాల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో భాగంగా మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి తెలుగు లెక్చరర్ గా ఎంపిక అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కనీసం బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామీణ ప్రాంతం నుండి లెక్చరర్ గా ఎంపికైనా తొలి మహిళ కావడం విశేషం. ఇంతే కాకుండా గత సంవత్సరం కస్తూర్బా బాలికల కళాశాల లెక్చరర్‌గా, స్పెషల్ ఆఫీసర్ గా ఎంపికావడం గమనార్హం. దీంతో మండల ప్రజలు మరియు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- ప్రధాన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలి
- వేసవిపై యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్లాలి
- పలు మండలాల్లో కార్యదర్శులతో అధికారుల సమావేశం

నవతెలంగాణ-విలేకరులబృందం

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య రానీయకుండా చూడాలని జీపీ కార్యదర్శులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రధానంగా ప్రతిసారి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. యాక్షన్ ప్లాన్ చేపట్టి ఆ దిశగా పనులు చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రానీయకుండా చూడాలని సూచించారు. ఆమేరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు జీపీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తాగునీటి ఎద్దడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్..


కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలి

డిచ్‌పల్లి : ప్రస్తుతం వేసవికాలం ఉన్నందున గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా ఉండడానికి తాగునీటి పంపిణీ సక్రమంగా నిర్వహించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీందర్ సూచించారు.శుక్రవారం డిచ్ పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, త్రాగు నీటి అధికారులతో యాక్షన్ ప్లాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎ గ్రామమైన తాగునీటి సమస్యలు రాకుండా ఉండడానికి ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి పంపిణీని సక్రమంగా నిర్వహించడానికి ఈ యాక్షన్ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈ ఈ ధర్మేంద్ర, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎఈ లు, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, మండలంలోని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి ఇక్కట్లు రానీయొద్దు

కమ్మర్‌పల్లి : వేసవిలో గ్రామాల్లో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వేసవి ప్రణాళికపై మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏ గ్రామంలో కూడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తకుండా తగిన విధంగా పంచాయతీ సిబ్బంది ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అవసరం మేరకు పైప్ లైన్లు, బోరు, మోటారు తదితర వాటిని సమకూర్చుకొని ప్రజలకు మాత్రం వేసవిలో నీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్ల పై కూడా పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

బోధన్ : వేసవి కాలం సందర్భంగా గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేకాధికులు, పంచాయతి కార్యదర్శులు చర్యలు చేపట్టాలని బోధన్ ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో వేసవి ప్రత్యేక ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు చేపట్టవలసిన కార్యాచరణపై అవగాహన కలిగించారు. తాగునీటి పైపుల మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. పంచాయతీలలో ఉన్న నిధులతోనే మౌలికసౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ అనీల్, ఎంపీఓ మధుకర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

రెంజల్ : వేసవి కాలం ప్రారంభం కావడంతో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో శంకర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఉన్నత స్థాయి అధికారులతో సంప్రదించి సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఆర్‌డబ్లుఎస్ ఈఈ ముని నాయక్, ఎంపీవో గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పిఆర్ఏఈ వినయ్‌కుమార్, నీటిపారుదల శాఖ భుజేందర్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతాలను గుర్తించాలి

భీంగల్ : మండలంలోని గ్రామాలలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగు నీటికి ఇబ్బంది కాకుండా ఉండేందుకు ముందుగా నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి వాటి పరిష్కారాలకు మార్గం చూపాలన్నారు. గ్రామాలలోని బోరు మోటర్లు పైప్ లైన్‌లు మరమ్మత్తులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. అలాగే మిషన్ భగీరథ నీటి సరఫరా, పైప్‌లైన్‌లు పనితీరుపై పర్యవేక్షించాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ గంగా మోహన్, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ సందీప్, ఏపీవో నరసయ్య తదితరులున్నారు.


రెంజల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్


బోధన్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్


భీంగల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

గ్యారెంటీల అమలు పట్ల హర్షం


సీఎం రేవంత్‌రెడ్డిచిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయం వద్ద శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నేటి నుంచి రెండు గ్యారంటీలు అమలవుతున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతుందన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పడగానే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజు ఆరోగ్య భీమ రూ.10లక్షల పెంపు రెండు గ్యారెంటీలను చేసిందన్నారు. ప్రస్తుతం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పాలపు నరసయ్య, వేముల గంగారెడ్డి, తక్కురి దేవేందర్, బుచ్చి మల్లయ్య సింగిరెడ్డి శేఖర్, వేములవాడ జగదీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తాడేం (తానాకుర్దు) గ్రామంలో యన్ఆర్ఈజిఎస్ నిధులతో ఐదు లక్షల రూపాయలతో శుక్రవారం సిసి రోడ్ పనులను గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోర్గం మాజీ సోసిటీ చైర్మన్ కుచన్పల్లి సూర్యరెడ్డి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఇచ్చిన ఆరు గ్యారంటీలను కూడా త్వరలో అమలు చేస్తుందని అన్నారు. అలాగే రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకుల పల్లి భూపతిరెడ్డి సహకారంతో గ్రామాన్ని మండల అభివృద్ధికి కృషి జరుగుతుందని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలకు మహర్దశ ప్రారంభమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని అయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, విజయ్, రాజేశ్వర్, కిరణ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దిరజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంఎడ్ మూడవ సెమిస్టర్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఏం.ఎడ్ రెగ్యులర్ మూడవ సెమిస్టర్ పరీక్షలు మూడవ రోజు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం జరిగిన పరీక్షలకు ఉదయం 36 మంది విద్యార్థులకు 35 మంది విద్యార్థులు హాజరయ్యారు (01)ఒకరు గైరాజరయ్యారని ఆడి సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఉపాధి ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

వేసవి ఎండలు ముదురుతున్నందున ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపిడిఓ చింత రాజ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని నాగపూర్ లో జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎండల బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. అయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు, తదితరులు ఉన్నారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నీకి మహేష్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మహేశ్‌కుమార్

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీకి జిల్లాకు చెందిన తోగల్ల మహేష్ కుమార్ ఎంపిక అయ్యారు. మార్చ్ 3 నుండి చండీగఢ్ లో నిర్వహించే ఆల్ ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. మహేష్ కుమార్ నందిపేట మండలంలోని కంఠం గ్రామంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఎస్ ఏ (గణితం) ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఎంపిక సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్ ఉపాధ్యాయ బృందం గోపి, ఆనంద్, శ్రీనివాస్, విడిసి కంఠం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి


కైలాస్ శ్రీనివాస్‌రావుకు సన్మానం

కామారెడ్డి పట్టణ కేంద్రంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు ను 46వ వార్డు కౌన్సిలర్ కోయాల్కర్ కన్నయ్య బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో తాటి (మెడికల్ రాజు) కందుకూరి సుధాకర్ గౌడ్, సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, నర్సింగ్, సాయి, హుస్సేన్, ఆకుల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెరిగితే వికసిత్ భారత్

- 'వికసిత్ భారత్-విద్యారంగం పాత్ర'పై సెమినార్‌లో పలువురు వక్తలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న కల్పన ప్రవీన్‌పాండే

అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంగ్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ లో"వికసిత్ భారత్- విద్యా రంగం పాత్ర" అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఏబిఆర్ఎస్ఎం జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కల్పన ప్రవీన్ పాండే పాల్గొని మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే యూనివర్సిటీ కీలక పాత్ర పోషించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అధ్యాపకులు భారతదేశ సంబంధిత పరిశోధనలు ప్రయోగాలు చేసి 2047వ సంవత్సరం వరకు భారతదేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సెక్రటరీ గుంత లక్ష్మణ్ జి మాట్లాడుతూ దేశీయ టెక్నాలజీ అభివృద్ధి చేసి, భారతదేశ ఆత్మ నిర్భరతకు పాటుపడాలని అధ్యాపకులకు పరిశోధకులకు విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారతదేశ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో అపూర్వమైన ప్రగతిని సాధిస్తున్నదని, దేశ రక్షణలో ఎంతోముందంజ వేసిందని తెలిపారు. పునరుత్పాదక ఇంధనాల అభివృద్ధికి పాటుపడుతూ, మౌలిక సదుపాయాల కల్పనలో గొప్ప అభివృద్ధిని సాధిస్తూ భారతదేశం ప్రపంచ స్థాయిలో ఒక బలమైన దేశంగా అభివృద్ధి సాధించిందన్నారు. దేశంలో ప్రతి పౌరుడు, విద్యార్థి తానే ఒక సైనికుడిగా పనిచేస్తూ దేశ సుస్థిర , సురక్షిత అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.ఆత్మ నిర్భర భారత్ నుండి వికసిత భారత్ కోసం కృషి చేస్తూ.. భారత్ తన విశ్వ గురువు స్థానాన్ని తిరిగి అందుకోవడానికి సమిష్టి కృషి చేయాలని లక్ష్మణ్ జి అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహ ఆచార్యులు డాక్టర్ కే రాజారామ్ మాట్లాడుతూ దేశం తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు, విద్యా వైద్య రంగంలో అభివృద్ధి సాధిస్తూ వికసితభారత్‌గా అవతరించాలని తెలిపారు. ఈ దిశగా యూనివర్సిటీలు పరిశోధన కేంద్రాలుగా, ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలుగా ఎదగాలని అప్పుడే వికసిత భారత్ సాధ్యమవుతుందని తెలిపారు.

యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి మాట్లాడుతూ టెక్నాలజీ పెంపు ద్వారా, మానవనరుల అభివృద్ధి ద్వారా వికసిత్ భారత దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్ సమన్వయకర్తలుగా డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ ఎం సత్యనారాయణ, డాక్టర్ శిరీష బోయపాటి వ్యవహరించారు. ఏ బి ఆర్ ఎస్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదయ్య, తెలంగాణ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ఆంజనేయులు, డీన్ రాంబాబు, సంపత్ కుమార్, రవీందర్ రెడ్డి, నాగరాజు, ప్రసన్న షీలా, వీరభద్రం, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పార్టీలతో సంబంధం లేకుండా

అందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-నిజాంసాగర్


మాట్లాడుతున్న లక్ష్మికాంత్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అన్నివేళలా సహాయం చేయడానికి ముందుంటుందని ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పార్టీలతో గానీ వేరే పార్టీ కార్యకర్తతో గానీ సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటుందని ఆయన అన్నారు. ఉమ్మడి మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో గున్కుల్ సొసైటీ కళ్యాణ మండపంలో జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చూసుకున్నట్లయితే వాళ్ల కార్యకర్తలకు తప్ప వేరే సాధారణ వ్యక్తులకు ఎలాంటి పథకాలు అందించేవారు కాదని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారు అన్నట్టుగానే ఆరు గ్యారెంటీలను అమలు పరచడంలో నిక్షాక్షపాతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. మొన్న జరిగిన చేవెళ్ల సభలో 500 కే గ్యాస్ సిలిండం 2 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించామని అతి త్వరలోనే రుణమాఫీ కూడా చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ అని ఆయన అన్నారు. పేద ప్రజలకు సేవ చేయడానికి పార్టీ ఎప్పుడు కూడా ముందు ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్ పటేల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, నిజాంసాగర్ ఎమ్మార్వో హెచ్ బిక్షపతి, మహమ్మద్ నగర్ ఎమ్మార్వో క్రాంతి కుమార్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్ అంజయ్య కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు జోహార్లు


జోహార్‌లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మీ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం, మాదిగ రిజర్వేషన్ కోసం భారతి అనే మహిళ ఎస్సీ వర్గీకరణ కోసం కోసం చేసిన పోరాటంలో తొక్కిసలాటలో మృతి చెందిందని, ఎందరో ఇలాంటివారు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అమరులైనారన్నారు. మృతి చెందిన వారికి అందరికీ జోహార్లు అర్పిస్తున్నామని వారి ఆశయం ఎస్సీ వర్గీకరణ అని దాన్ని లక్ష్యంగానే ఉద్యమాలకు అంకితమై వారందరికీ జోహార్లు అర్పిస్తున్నాం అన్నారు. రెండు నిమిషాల పాటు అమరులకు ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించరు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమల్లోకి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్ రాములు, జిల్లా నాయకుడు కొత్తల్లో యాదగిరి, మహిళ నాయకురాలు జంగిటి లత, కూచంపల్లి రేణుక, సతీష్, శ్యామ్, సోమవారం అరుణ, తదితరులు పాల్గొన్నారు.